క్లుప్తంగా

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు


జేసీబీతో ప్రహరీ కూల్చివేయించిన మున్సిపల్ సిబ్బంది

విజయనగరం: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. నగరంలోని డబుల్ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీని మున్సిపల్ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. ఈ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి ప్రహరీ నిర్మిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు చర్యలకు కమిషనర్ ఆదేశాలివ్వగా ప్రణాళిక అధికారులు నిర్మాణాన్ని పడగొట్టారు. అలాగే అనుమతి లేకుండా ఫ్లెక్సీల ఏర్పాటుకు సిద్ధమవుతున్న కొన్ని ఫ్లెక్సీల ఏర్పాటు బోర్డులను కూడా సీజ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.50,116 ఆర్థికసాయం


కమిటీ ప్రతినిధులకు ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గులివిందల వెంకట రామ్మోహనరావు, రమణి దంపతులు రూ.50,116లను కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. తల్లిదండ్రులు గులివిందల వెంకట రామారావు, తేజోవతి జ్ఞాపకార్థం ఆర్థిక సహకారం అందజేసినట్లు రామ్మోహనరావు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ భానుప్రకాష్‌రావు

గుర్ల: స్థానిక ఎమ్మార్సీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈఓ ఎస్.భాను ప్రకాష్, ఎంఈఓ-2 శ్రీనివాసరావు, సీఆర్పీలు పర్యవేక్షించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


పరిశ్రమలోని అడ్మిన్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద ఉన్న శ్రీ వెంకట్రామా పాల్ట్రీ పరిశ్రమలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. పత్తికాయవలస, కరకాం, సంకుపాలెం, పి.కె.పాలవలస, గత్సలవలస తదితర గ్రామాలకు చెందిన కార్మికులు పరిశ్రమ ప్రధాన గేటు ముందు ధర్నా చేశారు. వీరికి టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. అన్యాయంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని రెండు నెలలుగా డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ ప్రధాన గేటును తొలగించుకుని పరిశ్రమ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంతలో సీఐ శంకరరావు నేతృత్వంలో చీపురుపల్లి, గరివిడి ఎస్ఐలు దామోదరరావు, లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి వచ్చి కార్మికులను అడ్డుకున్నారు. పరిశ్రమలో ఉన్న ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి యాజమాన్యం కార్మికులతో చర్చలు జరుపుతుందని చెప్పి నిరసన విరమింపజేశారు.



విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- నగర డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయరు శ్రావణి తదితరులు

విజయనగరం: భావిభారత పౌరులైన విద్యార్థులంతా భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగి, దేశాభివృద్ధికి తోడ్పాడాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. సోమవారం నగరంలోని థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో 20వ డివిజన్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ బీపీఎం ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులకు ఆమె ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకున్న చర్యలను ప్రశంసించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తద్వారా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తూ విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.తవిటిరాజు, థెరిసా క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి కేటీ కురియకోస్ పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయించొద్దు


సమావేశంలో సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ కోటేశ్వరరావు


డెంకాడలో షాపులోని స్టాకు, రికార్డులు పరిశీలిస్తున్న ఏవో సంగీత

నెల్లిమర్ల: నిర్దేశిత ధర కన్నా అధిక ధరకు ఎరువులు, పురుగుమందులు విక్రయించవద్దని వ్యవసాయ శాఖ ఏడీ కోటేశ్వరరావు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలానికి చెందిన డీలర్లతో సోమవారం ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. షాపుల వద్ద స్టాక్‌బోర్డుపై వివరాలు ఎప్పటికప్పుడు పొందుపరచాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి పి.శ్రీలక్ష్మి, ఏఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ఎరువులు, విత్తనాలు విక్రయించే వారంతా ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సంగీత హెచ్చరించారు. మండలంలోని పలువురు ప్రైవేటు డీలర్ల షాపులు, సొసైటీలను ఆమె సోమవారం సందర్శించి, తనిఖీలు చేపట్టారు. స్టాకు, అమ్మకాలు తదితర వాటిని పరిశీలించి, మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు సమకూరుస్తామని ఆమె తెలిపారు.

• 9న దేశవ్యాప్త సమ్మె


ఆటో కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

భోగాపురం: కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 9న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆటో కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులపై పెనుభారం మోపుతోందని, ఆర్థిక సమస్యలతో పూటగడవని దుస్థితిలో వారు ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారానికి తమతో కలసి రావాలని సమ్మెకు సహకరించాలని కోరారు.



విజయనగరం గంటస్తంభం: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఎల్బీజీ భవనంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. బ్రిటిష్ కాలంలో కార్మిక చట్టాలను పోరాడి సాధించుకోవడం జరిగిందని, 8 గంటల పని కోసం వేలాది మంది కార్మికులు జైలుకు వెళ్లి, రక్తాన్ని చిందించారని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తోందన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక విధానాలు కార్మికులకు ఉరితాళ్లలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపయోగపడే 44 చట్టాలను, నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

‘బొత్స’ను విమర్శించే అర్హత మీకు లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: నిరంతర ప్రజా సేవకుడు, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను విమర్శించే అర్హత మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడితో కలిసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంపై కనీస పరిజ్ఞానంలేనివారు బొత్స కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏడాది తిరగకముందే ఇచ్చిన ప్రతీ హామీను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థలతో పాటు పథకాలకు మంగళం పాడేశారన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధి రాష్ట్ర వ్యాప్తంగా 83 లక్షలు మంది పిల్లలకు అందాల్సి ఉండగా కేవలం 43 లక్షలు మందికే అందజేశారన్నారు. ఉచిత గ్యాస్ పథకం ఎంత మందికి వచ్చిందో టీడీపీ నేతల తమ సొంత గ్రామాల్లో సర్వే చేసుకుంటే తెలుస్తుందన్నారు. మహిళలకు ప్రతినెలా ఇస్తామన్న రూ.1800 ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు ఇస్తామని ఒక్కరికై నా ఇచ్చారా చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఏడాదిలో 4 లక్షలు ఉద్యోగాలు లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎంతమందికి ఇచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు. జూన్ 21న రైతుభరోసా ఇస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించి ఇంతవరకు ఇవ్వకపోవడం సిగ్గుచేట్టారు. కొత్త పింఛన్లు విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చి ఇంతవరకు ఫించన్ డబ్బులు విడుదల చేయలేదని, దానికి సంబంధించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకులు పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, గవిడి సురేష్, కొసిరెడ్డి రమణ, రేవల్ల సత్తిబాబు, కర్రోతు ప్రసాద్, బలరాం, మజ్జి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

‘నవజీవన్’ సేవలు అభినందనీయం

విజయనగరం గంటస్తంభం: తిరుపతి ప్రధాన కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా నవజీవన్ ఆశ్రమాలు ఏర్పాటు చేసి, పేద విద్యార్థులు, వృద్ధులకు తోడ్పడుతుండడం అభినందనీయమని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ ప్రశంసించారు. కణపాక నవజీవన్ ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీధర్ ఆచార్య పుట్టినరోజు సందర్భంగా నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఆలోచించి, వారికి అండగా ఉండడమనేది చాలా గొప్ప విషయమని, తల్లిదండ్రులు లేని పిల్లలను, అత్యంత పేదరికంలో ఉన్న పిల్లలను తన ఆశ్రమంలో చేర్చి విద్యాబుద్ధులు నేర్పి వారికి సరికొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లని తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి శ్రీధర్ ఆచార్య అని కొనియాడారు. ప్రభుత్వాలు చేయలేని పని ఒక వ్యక్తి చేయడం సామాన్య విషయం కాదన్నారు. ప్రతి నెలా అన్నలక్ష్మి అని ఒక పథకం ప్రవేశపెట్టి వృద్ధులు, వితంతువులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందివ్వడం నవజీవన్ ట్రస్టు గొప్పతనమన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

పూసపాటిరేగ: ప్రభుత్వ భూ హబ్‌కు మండల పరిధిలోని 122 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు సంజీవకుమార్ సోమవారం తెలిపారు. కొప్పెర్ల పరిధిలో 12.11 ఎకరాలు, సీహెచ్ అగ్రహారంలో 38.22 ఎకరాలు, గైతులచోడవరంలో 55.61 ఎకరాలు, పూసపాటిరేగ పరిధిలో 18.98 ఎకరాలు ప్రభుత్వ డీ పట్టా భూములను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భోగాపురం మండలంలోని ప్రభుత్వ భూమిని కూడా పరిశీలించామన్నారు. ఇప్పటికే వీఎంఆర్‌డీఏ కార్యదర్శి విశ్వనాథం, విజయనగరం ఆర్‌డీవో దాట్ల కీర్తి ప్రభుత్వ భూమిని పరిశీలించడం జరిగిందన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

విజయనగరం టౌన్: ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదికకు సంబంధించి రూపొందించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవొపా) అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ తెలిపారు.

అందరిపైనా దేవుడి ఆశీస్సులు ఉండాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): యేసు క్రీస్తు ఆశీస్సులు అందరిపైనా ఉండాలని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఆకాంక్షించారు. గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో సోమవారం జరిగిన యేసుక్రీస్తు ప్రార్థన మందిరం 20వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని, శాంతి, ప్రేమ, దయ గుణము కలిగిన యేసు బోధనలను అనుసరించాలన్నారు. అనంతరం దైవ సేవకుని కుటుంబాన్ని సన్మానించారు. కార్యక్రమంలో దైవసేవకులు ఎం.స్టీవెన్, ప్రభాకరరావు, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు, డయేరియా, తదితర వ్యాధుల నివారణ అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

వసతిగృహ సందర్శన

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహ ఆవరణలో గల పండ్ల మొక్కలను, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకూడదని సూచించారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

పూసపాటిరేగ: డెంకాడ మండలంలోని పినతాడివాడ పోలీస్‌స్టేషన్ సమీపంలో వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఇదే కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. ఇదిలా ఉంటే ఉదయం ఏ గ్రామంలోని నాయకులు ఆ గ్రామంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహించుకున్న అనంతరం ఈ సమావేశానికి రావాలన్నారు.

డెంకాడ: స్థానిక పోలీస్‌స్టేషన్ వెనక పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఇంటి సమీపంలో వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించి, డెంకాడ బజార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం పినతాడివాడలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెలిమర్ల మండలాలతో పాటు నెల్లిమర్ల నగరపంచాయతీ నుంచి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

సులభంగా పౌరసేవలు అందివ్వాలన్నదే లక్ష్యం


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇతర అధికారులు

విజయనగరం: పౌరులకు సులభంగా పౌరసేవలు అందివ్వాలన్నదే పురమిత్ర-మనమిత్ర యాప్‌ల లక్ష్యమని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్ అన్నారు. ఇదే విషయమై ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా పౌరసేవలు పొందేందుకే ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ సేవలు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. పురమిత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. పురపాలక, నగరపాలక సంస్థల్లో అందిస్తున్న సేవలను ఆన్‌లైన్‌లో పొందపరచాలన్నారు. అన్నివిధాలుగా పరిశీలించినానంతరం ఉత్తమ ఫలితాలు కనబరచిన సంస్థలకు అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సీటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి


ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు, తదితరులు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ ఇంజినీరింగ్ నాన్-పీహెచ్ కార్మికులకు కనీస వేతనంగా రూ.21 వేలు ఇవ్వాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు సోమవారం నిరసనకు దిగారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకుడు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులతో సమానంగా కనీస వేతనం రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500లు ఇవ్వాలని, థర్డ్ పార్టీ కార్మికులకు ఆప్కాస్ కార్మికులకు చెల్లిస్తున్న జీతాలను టెండర్‌లో కోడ్ చేయాలని, ప్రతి నెల 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, పండగ, జాతీయ సెలవు దినాలు, సిక్, క్యాజువల్ లీవులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికుల వాటాతో పాటు, యాజమాన్యం వాటా కూడా సక్రమంగా జమచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే జీతాలు పెంచుతూ జీవో విడుదల చేయాలన్నారు. అంతవరకు దశలవారీగా నిరసన తెలియజేస్తామని, అందులో భాగంగా జూలై 8న మున్సిపల్ ఆఫీస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నామని, జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని, ఈనెల 10న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇవన్నీ చేసిన తర్వాత కూడా ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే జూలై 12న అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చంద్రరావు, సంతోష్, కిరణ్, గోవిందు, రాంబాబు, గౌరీష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

